

ఇరు రాష్ట్రాల్లో ఓటేశారు..

- పోలింగ్ కేంద్రాలకు పోటెత్తిన కొరియా వాసులు
- ఏపీలో 78 , ఒడిశాలో 77 శాతం ఓటింగ్ నమోదు



నేరేళ్లవలసలో ఏపీకి ఓటు వేయడానికి క్యూలో ఉన్న కొరియా ఓటర్లు (ఫైల్)

సాలూరు రూరల్, మే 15: ఏవోబీ వివాదాస్పద ప్రాంతం.. కొఠియా గ్రూపు ఓటర్లు ఇటు ఏపీలోను, అటు ఒడిశాలోను ఓట్లు వేశారు. ఇరు రాష్ట్రాలకు ఒకే రోజు పోలింగ్ జరిగినా ఇరుచోట్లా కొఠియా వాసులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏపీ పరిధిలో ఉన్న 2,554 మంది కొఠియా ఓటర్లుకు గాను 1,991 మంది ఓటు వినియోగించుకున్నారు. దీంతో ఏపీలో పోలింగ్ 78 శాతంగా నమోదైంది. ఒడిశా పరిధిలో 5,510 మంది ఓటర్లకు గాను 4,217 మంది ఓట్లు వేసినట్టు ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కాగా ఒడిశాలో పోలింగ్ 77 శాతంగా నమోదైంది.

ఆది నుంచి ఉత్కంఠ..

కొఠియా ఓటర్ల విషయంలో ఆది నుంచి ఇరు రాష్ట్రాల్లో ఉత్కంఠ నెలకొంది. 1996 పార్లమెంట్ మధ్యంతర ఎన్నికల తర్వాత 2024లో ఇటు అరకు, అటు కోరాపుట్ లోక్‌సభ స్థానాలకు ఒకే రోజున ఎన్నికలు జరిగాయి. గతంలో ఎన్నికలకు కొద్ది రోజుల ముందే ఇరు రాష్ట్రాల్లో వారు ఓట్లు వేసుకోవచ్చునని ఏపీ, ఒడిశా జిల్లా అధికారులు ప్రకటించారు. ఇప్పుడు మాత్రం ఈ విషయమై ఇరు రాష్ట్రాల నుంచి సరైన స్పష్టత కనిపించలేదు. సాలూరు ఆర్వో విష్ణుచరణ్ మాత్రం కొఠియా వాసులు తమకు నచ్చిన రాష్ట్రంలో ఓట్లు వేసుకోవచ్చునని ప్రకటించారు. ఇదిలా ఉండగా ఒడిశా తమ గ్రామాలకు సమీపంలో పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసింది.

ఏపీ మాత్రం గరిష్టంగా 22 కిలోమీటర్ల దూరంలో కొఠియా వాసుల కోసం పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేసింది. అయినా ఆ ప్రాంతవాసులు ఇరు రాష్ట్రాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏపీలో ఓటు వేసేందుకు గాను ముందు రోజు రాత్రే నేరేళ్లవలస, శిఖపరువు గ్రామాలకు చేరుకొని బస చేశారు. మధ్యాహ్నానికల్లా ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు వేశారు. ఆ తర్వాత తమ గ్రామాలకు సమీపంలో ఉన్న ఒడిశా పోలింగ్‌స్టేషన్లకు వెళ్లి ఓట్లు వేశారు. కాగా ఇరు రాష్ట్రాల్లో మెరుగైన పోలింగ్‌శాతం నమోదైంది.



కొఠియా ప్రాంతం



స్ట్రాంగ్ రూములను పరిశీలిస్తున్న కలెక్టర్

అప్రమత్తంగా ఉండాలి

- స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతా సిబ్బందికి కలెక్టర్ ఆదేశం

గరుగుబిల్లి, మే 15: స్ట్రాంగ్ రూముల పరిధిలో భద్రతా సిబ్బంది వచ్చే నెల 4వ తేదీ వరకు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. ఉల్లిభద్ర సమీపంలోని ఉద్యాన కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచిన గదులను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్ట్రాంగ్ రూములకు మూడంచెల భద్రత, బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. మొదటిస్థాయిలో స్థానిక పోలీస్ సిబ్బంది, రెండో స్థాయిలో రాష్ట్ర సాయుధ బలగాలు, మూడో స్థాయిలో కేంద్ర సాయుధ బలగాలు పహారా ఉంటుం దని వెల్లడించారు. స్ట్రాంగ్ రూముల పరిసర ప్రాంతాల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించ రాదన్నారు. ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. స్ట్రాంగ్ రూములను పరిశీలించేందుకు వచ్చే అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు విధిగా అనుమతులు ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ విధిగా ఎన్నికల నియమావళిని పాటించాల్సి ఉంటుందని తెలిపారు. స్ట్రాంగ్ రూముల ఆవరణలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో జేసీ శోభిక, పార్వతీపురం ఐటీడీఏ పీవో సి.విష్ణు చరణ్, ఎస్‌డీసీ వి.సూర్యనారాయణ, ఏఎస్పీ దిలీప్‌కిరణ్ పాల్గొన్నారు.



పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులు ఇలా..

వలస ఓటర్ల తిరుగు ప్రయాణం..

పార్వతీపురం టౌన్, మే 15: జిల్లాకు చెందిన వలస ఓటర్లు తిరుగు ప్రయాణమయ్యారు. పిల్లాపాపలు, కుటుంబ సభ్యులతో కలిసి ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు పయనమయ్యారు. ఈనెల 13న జరిగిన పోలింగ్‌కు వేర్వేరు ప్రాంతాల నుంచి ఎంతోమంది స్వగ్రామాలు, పట్టణాలకు వచ్చిన సంగతి తెలిసిందే. క్యూలైన్లలో గంటల కొద్దీ నిరీక్షించి మరీ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయితే ఓట్ల పండగ పూర్తి కావడంతో బుధవారం వారంతా తిరుగుముఖం పట్టారు. ఉద్యోగ, వ్యాపారాలు, ఉపాధి పనుల నిమిత్తం పొరుగు రాష్ట్రాలు, జిల్లాకు బయల్దేరారు. దీంతో జిల్లాకేంద్రంలో రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రయాణికులతో కిటకిటలాడాయి. అయితే పార్వతీపురం నుంచి విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ, తదితర ప్రాంతాలకు సకాలంలో బస్సులు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండలో నిరీక్షించలేక నానా అవస్థలు పడ్డారు. చివరకు తమ గమ్యస్థానాలను చేరుకొనేందుకు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మహిళలే నిర్ణేతలు

- అభ్యర్థుల భవితవ్యం తేల్చేది వారే...

పార్వతీపురం, మే15 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో మహిళలే ఎక్కువగా ఓటుహక్కు వినియోగించుకున్నారు. పలుచోట్ల పురుషుల కంటే మహిళల ఓటింగ్ శాతం ఎక్కువగా ఉంది. చంటి పిల్లలతో కూడా ఎంతోమంది వచ్చారు. క్యూలో గంటల తరబడి నిల్చొని మరీ ఓటు వేశారు. దీంతో అభ్యర్థుల గెలుపు.. ఓటములలో వీరే ప్రధాన పాత్ర పోషించనున్నారు. జిల్లాలో మొత్తంగా 7,83,440 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 3,82,589 మంది పురుషులు 4,00,779 మంది మహిళలు, ఇతరులు 72 మంది ఉన్నారు. ఇందులో 2,94,777 మంది పురుషులు, 3,09,245 మంది మహిళలు, 42 మంది ఇతరులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయితే పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఓటు వేసినట్లు స్పష్టమవుతోంది. ఏ నియోజకవర్గంలో చూసినా ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో మహిళలే అధికంగా కనిపిస్తున్నారు. మొత్తంగా అభ్యర్థుల భవితవ్యాన్ని వారే తేల్చనున్నారు.

నియోజకవర్గాల వారీగా చూస్తే..

- పార్వతీపురం నియోజకవర్గంలో 96,292 మంది మహిళా ఓటర్లు ఉండగా 75,908 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 93,514 మంది పురుషులు ఉండగా 72,592 మంది ఓటు వేశారు.
- సాలూరు నియోజకవర్గంలో 1,04,715 మంది మహిళా ఓటర్లు ఉండగా 79,928 మంది ఓటు వేశారు. 99,770 మంది పురుషులు ఉండగా.. 76,403 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- కురుపాం నియోజకవర్గంలో 99,736 మంది మహిళలకు గాను 78,419 మంది ఓటు వేశారు. పురుష ఓటర్లు 94,336 మంది ఉండగా 74,005 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- పాలకొండ నియోజకవర్గంలో 1,00,036 మంది మహిళా ఓటర్లు ఉండగా 74,990 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 94,969 మంది పురుష ఓటర్లు ఉండగా 71,777 మంది ఓటు వేశారు. మొత్తంగా నాలుగు నియోజకవర్గాల్లోనూ మహిళలే అధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకోగా.. అభ్యర్థుల గెలుపులో వారి పాత్ర కీలకం కానుంది.


వీరంతా ఓటుకు దూరం..

జిల్లాలో ఈ సారి 1,78,376 మంది ఓటుకు దూరమయ్యారు. కారణాలేమైనా గణాంకాల ప్రకారం.. పార్వతీపురం నియోజకవర్గంలో 40,315 మంది, పాలకొండలో 48,239 మంది, కురుపాంలో 41,664 మంది, సాలూరులో 48,158 మంది ఓటేయలేదు.

ఇంటర్ చదివేదెలా?

- గురుకుల రెసిడెన్షియల్ కళాశాలల్లో సీటు పొందాలంటే కష్టమే..
- టెన్త్ పాసైన వారు మూడు వేల మంది
- వెయ్యి సీట్లకే నోటిఫికేషన్
- గిరిజన విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- దూర ప్రాంతాలకు వెళ్లలేని పరిస్థితి..
- ఉన్నత విద్యకు దూరమవుతున్న వైనం
- జిల్లా అధికారులు స్పందించాలని విన్నపం





సీతంపేటలో బాలుర గురుకుల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల

(సీతంపేట)

జిల్లాలోని పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలోని గురుకుల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో సీటు పొందాలంటే లక్కు ఉండాల్సిందే. ఆయా గురుకులాల్లో సీట్లు తక్కువగా ఉండడంతో ఏటా విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించినా.. ఇంటర్ విద్యను మాత్రం చదువుకోలేక పోతున్నారు. దీంతో ఎంతోమంది గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు.

ఇదీ పరిస్థితి..

ఈ ఏడాది రెండు ఐటీడీఏల పరిధిలో 3 వేల మందికి పైగా గిరిజన విద్యార్థులు టెన్త్ పాసయ్యారు. వారిలో 550 మార్కులు పైడి సాధించిన వారు ఎంతోమంది ఉన్నారు. కాగా జిల్లాలో ఎనిమిది గురుకుల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలే ఉన్నాయి. వాటిల్లో 2,060 మంది విద్యార్థులు చదువుకునే అవకాశం ఉంది. అయితే ఆ స్థాయిలో మౌలిక సౌకర్యాలు అక్కడ లేవు. దీంతో ఏటాలానే ఈ సారి కూడా 1,030 మంది విద్యార్థులకే సీట్లు కేటాయించారు. ఎనిమిది కాలేజీల్లో ఎంపీసీ, బైపీసీ విభాగాలకు సంబంధించి ఒక్కో గ్రూపునకు 40 సీట్లు చొప్పున 640 మంది విద్యార్థులకే సీట్లు కేటాయించారు. ఈ కోర్సుల్లో చదువుకోవడానికి అత్యధికులు ఆసక్తి చూపిస్తు న్నప్పటికీ ఆ స్థాయిలో సీట్లు లేకపోవడంతో ప్రత్యామ్నా యంగా సీఈసీ గ్రూప్‌లో చేరాల్సి వస్తోంది. సీతంపేట ఐటీడీఏ పరిధిలో పెద్దమడి జూనియర్ కళా శాలలో 40 సీట్లు, పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో భద్రగిరి, పి.కోనవలస కళాశాలలో చెరో 40 సీట్లు కేటాయించారు. దూరాభారమైనా తప్పనిసరి పరిస్థితుల్లో సీతంపేట గిరిజన విద్యార్థులు ఆయా ప్రాంతాలకు చేరుకోవాల్సి వస్తోంది.

- సీతంపేట బాలుర, బాలికల గురుకుల జూనియర్ కళాశాలల్లో హెచ్ఈసీ గ్రూప్ లేదు. దీంతో విద్యార్థులు పాచిపెంట మండలం పి.కోనవలస, గుమ్మలక్ష్మీపురం భద్రగిరి కళాశాలలకుచేపేరుకోవాల్సి వస్తోంది. ఆయా కాలేజీల్లో చెరో 40 సీట్లు చొప్పున కేటాయించారు.
- సీతంపేట బాలికలు, బాలుర జూనియర్ కళాశాలల్లో చెరో 20 సీట్లు చొప్పున ఒకేషనల్ కోర్సులకు కేటాయించారు. ఇందులో సీట్లు రాని వారు పి.కోనవలస బాలుర, బాలికల కళాశాలలకు వెళ్తున్నారు. అక్కడ కూడా చెరో 20 సీట్లు చొప్పున కేటాయించారు. మొత్తంగా అన్ని కోర్సులకు సంబంధించి రెసిడెన్షియల్ కళాశాలలో గిరిజన విద్యార్థులకు 1,030 సీట్లే కేటాయించారు.
- జిల్లాలో సీతంపేట, గమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి, పాచిపెంట మండలం పి.కోనవలసలో మినహా మరెక్కడా బాలికల గురుకుల రెసిడిన్షియల్ కళాశాలలు లేవు. ఆయా చోట్ల 40 సీట్లు చొప్పున కేటాయించడంతో ఎంతోమంది గిరిజన బాలికలు ఇంటర్ విద్యకు నోచుకోవడం లేదు. ప్రైవేట్ కాలేజ్‌లో చదవాలనుకున్నప్పటికీ అంత స్థోమత లేక ఇళ్లకే పరిమితమవుతున్నారు.
- గత టీడీపీ హయాంలో అయితే కార్పొరేట్ కాలేజీలో గిరిజన విద్యార్థులకు సీటు కల్పించి, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చేవారు. వైసీపీ ఐదేళ్ల కాలంలో ఆ పరిస్థితి లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సీట్ల పెంపునకు తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నోటిఫికేషన్ ప్రకారమే..

ఈ సంవత్సరం ఇంటర్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ గురుకుల సంస్థ విడుదల చేసింది. ఈనెల 22న కౌన్సిలింగ్ జరగనుంది. నోటిఫికేషన్ ప్రకారమే ఐటీడీఏల పరిధిలోని గరుకుల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశా లుంటాయి. ఆ మేరకు సీట్లు భర్తీ చేస్తాం.

- నాగభూషణం, కన్వీనర్ ప్రిన్సిపాల్, గరుకుల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు, సీతంపేట

నేటి నుంచి ఏపీఈఏపీ సెట్

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

విజయనగరం, కలెక్టరేట్, మే 15: ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ప్రవేశ పరీక్షలు (ఏపీఈఏపీ) గురువారం నుంచి జరగనున్నాయి. ఆన్‌లైన్‌లో జరిగే ఈ పరీక్షల కోసం విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 16 నుంచి 23వ తేదీ వరకూ జరుగుతాయి. 16, 17 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీకి సంబంధించిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. 18 నుంచి 23 వరకూ ఇంజినీరింగ్ కోర్సు కోసం పరీక్షలు జరుగుతాయి. రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకూ నిర్వహించనున్నారు.

అంతటా అదే చర్చ

- ఎన్నికల ఫలితాలపై జోరుగా పందాలు

పార్వతీపురం, మే15 (ఆంధ్రజ్యోతి) : పోలింగ్ ముగిసింది. లెక్కింపు మిగిలింది. తీర్పు ఎవరికి అనుకూలం అన్నదే ఇప్పుడు అందరి మదిని తొలుస్తున్న ప్రశ్న. అందుకే జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఏ ఇద్దరు కలిసినా ఎన్నికల ఫలితాలపైనే మాట్లాడుకుంటున్నారు. ఏ పార్టీ గెలుస్తుంది? ఎవరికి ఎంత మెజార్టీ వస్తుంది! అనేది సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. ఎప్పుడు లేని విధంగా రాత్రి 11 గంటల వరకు ఈసారి పోలింగ్ జరిగింది. జిల్లా వ్యాప్తంగా సాధారణ ఓట్లు, పోస్టల్ బ్యాలెట్‌లు కలుపుకుని సుమారు 80 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ స్థాయిలో ఓట్లు పోలవడంతో అభ్యర్థుల గెలుపుతో పాటు రాష్ట్రంలో ఎవరు ప్రభుత్వ ఏర్పాటు చేస్తారన్న దానిపై ఉమ్మడి జిల్లాలో జోరుగా పందాలు సాగుతున్నాయి.

హడలెత్తిస్తున్నాయ్!

- జిల్లాలో వీధి కుక్కల స్వైర విహారం
- యథేచ్ఛగా దాడులు
- రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు
- వరుస సంఘటనలతో ప్రజలు బెంబేలు
- కానరాని సంతాన నిరోధక చర్యలు
- ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్



(జియ్యమ్మవలస)

జిల్లావాసులను వీధి కుక్కలు హడలెత్తిస్తున్నాయి. యథేచ్ఛగా దాడులకు పాల్పడుతూ.. భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తూ.. దొరికిన వారిని దొరికినట్లు కాటేస్తూ తీవ్రంగా గాయపరుస్తున్నాయి. మూగజీవాలు, జంతవులనూ హతమారుస్తున్నాయి. ప్రజలను వెంటబెట్టి మరీ కాటేస్తున్నాయి. వాహనదారులనూ వదలడం లేదు. చిన్నారులు, వృద్ధుల పరిస్థితి సరేసరి. రోజురోజుకూ బాధితుల సంఖ్య పెరుగుతోంది. మొత్తంగా వీధి కుక్కల కారణంగా బయటికి రావాలంటేనే జిల్లా ప్రజలు ఆలోచించాల్సి వస్తోంది.

ఆసుపత్రుల్లో పెరుగుతున్న కేసులు

జిల్లా అంతటా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తూ దాడులు చేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో రహదారులకు అవి అడ్డంగా వస్తుండడంతో ద్విచక్ర, ఇతర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మరికొంతమంది వాటిని తప్పించబోయి క్షతగాత్రులుగా మారుతున్నారు. ఇంకొందరు మంచాలకు పరిమితమవుతున్నారు. మరోవైపు ఆసుపత్రుల్లో కుక్కకాటు బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో 37 పీహెచ్‌సీలు, 5 అర్బన్ హెల్త్ సెంటర్లు, మూడు సీహెచ్‌సీలు, మూడు ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. పార్వతీపురంలో జిల్లాకేంద్రాసుపత్రి కూడా ఉంది. అయితే ఆయా ఆసుపత్రులకు కుక్క కాటు బాధితులు క్యూ కడుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో పది వేల మంది కుక్కకాటు బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. గత నెలలో మరో వంద మంది కుక్క కాటుకు గురయ్యారు. కొందరు బాధితులు ప్రభుత్వా సుపత్రులకు వెళ్లగా.. మరికొందరు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందుతున్నారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులు, వీధుల్లో గుంపులుగా తిరుగుతూ.. కనిపించిన వారిపై దాడి చేస్తున్న శునకాలపై కనీస చర్యలు తీసుకోకపోవడంపై వారు పెదవి విరుస్తున్నారు. ఇలాగే వదిలేస్తే వీధి కుక్కల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని, బాధితుల సంఖ్య కూడా రెట్టింపు కానుందని పలువురు వాపోతున్నారు. తక్షణమే జిల్లా అధికారులు స్పందించి వీధి శునకాలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయించాలని కోరుతున్నారు.

కొన్ని ఘటనలు

- జియ్యమ్మవలస మండలం చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇప్పటివరకు సుమారు 100 కుక్కకాటు కేసులు నమోదయ్యాయి.
- జనవరి 29న చినదోడిజకి చెందిన కొండగొర్రి సూరి అనే గిరిజనుడు కుక్క కాటుకు గురై చావు అంచుల వరకు వెళ్లాడు. ● ఫిబ్రవరి 14న బిత్రపాడుకి చెందిన గడసాపు హర్షిత అనే రెండేళ్ల బాలిక, మరడాన సింహాచలం అనే 52 ఏళ్ల వ్యక్తిపై శునకాలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. ● ఫిబ్రవరి 24న గరుగుబిల్లి మండలం నందివానివలసకి చెందిన మరడాన పారమ్మ అనే మహిళ కుక్క కాటుకు గురైంది. ● ఫిబ్రవరి 28న చిత్రపాడుకి చెందిన ఓ యువతిపై 12 కుక్కలు ఒకేసారి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ● అదే రోజు చినమేరంగిలో జి.సోములు అనే వ్యక్తి కూడా కుక్క కాటుకు గురయ్యాడు.
- ఫిబ్రవరి 29న చినమేరంగికి చెందిన వి.రాజుపై కుక్కలు దాడి చేశాయి.
- ఏప్రిల్‌లో కొమరాడ మండలం గుమడ గ్రామం రైల్వేస్టేషన్ సమీపంలో ఒకేసారి 25 మందిని కుక్కలు గాయపరిచాయి. ● కొమరాడ మండలం నిమ్మలపాడుకి చెందిన గళావల్లి పార్వతి కుక్క కాటుకు గురైంది. ● జియ్యమ్మవలస మండలం పెదమేరంగి జంక్షన్‌కు సమీపంలో మరడాన లక్ష్మిపై శునకాలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ● పాలకొండ మండలం యరకరాయపురంలో బహిర్భూమికి వెళ్లిన సిరిపురపు లక్కీ అనే ఎనిమిదేళ్ల బాలుడిపై కుక్కలు దారుణంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. ● ఏప్రిల్ 24న పెదమేరంగి కూడలి సమీపంలో గంట లక్ష్మి అనే మహిళ కుక్కల దాడిలో తీవ్రంగా గాయాల పాలైంది.
- ఏప్రిల్ 28న గవరమ్మపేట పంచాయతీ వెంకటరాజపురం గ్రామానికి చెందిన గొడబ సరోజని అనే మహిళ బహిర్భూమికి వెళ్లేసరికి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి.● ఏప్రిల్ 28న గవరమ్మపేటకి చెందిన మహేశ్వరి అనే డిగ్రీ విద్యార్థినిపై కుక్కలు దాడి చేశాయి. ● ఈనెల 11న వెంకటరాజపురంలో బి.లక్ష్మి(70) పై కుక్కలు దాడి చేశాయి. అక్కడికక్కడే ఆ వృద్ధురాలు మృతి చెందింది.



కలెక్టర్‌కు నివేదిస్తా..

కుక్కల బెడద చాలా ఎక్కువగా ఉండడం వాస్తవమే. అయితే ఆయా పంచాయతీ గ్రామసభ తీర్మానాలు తీసుకొని వస్తే దానిపై నోట్ ఫైల్ తయారు చేసి కలెక్టర్‌కు నివేదిక అందిస్తా. పై నుంచి ఆదేశాలు వచ్చిన తరువాత తగు చర్యలు తీసుకుంటాం.

- పి.శ్రీనివాసరావు, ఎంపీడీవో, జియ్యమ్మవలస

దిక్సూచి DIKSUCHI

సైన్స్ విద్యార్థుల కోసం
టెన్త్, ఇంటర్ తరవాత
What Next

(నిన్నటి పేజీ తరువాయి)

హోమ్ సైన్స్ అండ్ ఫుడ్ టెక్నాలజీ

ఇంటర్ బైపీసీతో పూర్తిచేసినవారు ఈ కోర్సుల్లో చేరవచ్చు. న్యూట్రిషనిస్ట్, డైటీషియన్స్, ఫుడ్ టెక్నాలజిస్టులుగా ఉపాధి లభిస్తుంది. సమతుల ఆహారంపై ఈ మధ్య కాలంలో అందరికీ అసక్తి ఏర్పడటంతో ప్రైవేటు రంగంలోనూ ఇబ్బడిముబ్బడిగా అవకాశాలు పెరుగుతున్నాయి. ముడి ఆహార పదార్థాలను మనుషులు, జంతువులు ఆసక్తిగా, అవసరమైనప్పుడు తినేట్టు చేయడమే ఫుడ్ టెక్నాలజీ కోర్సు. వివిధ పద్ధతులు ఆచరించి, మరికొన్ని కలిపి ఆహార పదార్థాలు రుచికితోడు నిల్వ ఉండేలా చేస్తుంటారు. ప్రస్తుతం దేశంలో మూడు కోట్లమంది నెలలో ఎక్కువ రోజులు ప్యాకేజీ ఫుడ్‌పై ఆధారపడి ఉన్నారు. మరో రెండు కోట్ల మంది త్వరలోనే ఈ జాబితాలో చేరే పరిస్థితిలో ఉన్నారని సర్వేలు చెబుతున్నాయి. అందుకే దేశంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఐదో స్థానంలో ఉన్నాయి. ఫుడ్ టెక్నాలజీ పరిశ్రమలో ఆర్గానిక్ కెమిస్టులు, బయోకెమిస్టులు, అనలిటికల్ కెమిస్టులు, హోస్ ఎకనమిస్టులు, ఇంజనీర్లు(కెమికల్, మెకానికల్, ఇండస్ట్రియల్, ఎలక్ట్రికల్, అగ్రికల్చరల్, సివిల్, ప్యాకింగ్), రీసెర్చ్ సైంటిస్టులు, మేనేజర్లు, అకౌంటెంట్‌లు మొదలైన వారికి అవకాశాలు ఉంటాయి. ఎంపిసి, బైపిసితో ఇంటర్ పూర్తిచేసి ఈ రంగంలోకి వెళ్లవచ్చు.



కోర్సు అందించే కొన్ని సంస్థలు

- Acharya N.G. Ranga Agricultural University, Bapatla, Andhra Pradesh,
- Prof. Jayasankar Agricultural University, Rajendra Nagar, Hyderabad-500030,
- Central Food Technology Research Institute, Mysore-570020, Karnataka.
- Central Institute of Fisheries Education, Fisheries University Road, Seven Bungalows, Andheri(W), Mumbai - 400061, Maharashtra, Website: www.cife.edu.in
- College of Agricultural Technology, Marathwada Krishi Vidyapeeth, Parbani-431402, Maharashtra.
- CSK Krishi Vishwa Vidyalaya, Palamuru-176060, Himachala Pradesh, Website: www.hillagric.org
- Govind Ballabh Pant University of Agriculture and Technology, Pantnagar-263145, Dist. Udham Singh Nagar, Uttarakhand, Website: www.gbpuat.ac.in
- Guru Nanak Dev University , Department of Food Science & Technology, Amritsar-143005, Punjab, Website: www.gndu.ac.in
- Harcourt Butler Technological Institute, Nawab Ganj, Kanpur-208002, Uttar Pradesh, Website: www.hbti.ac.in
- IIT(Indian Institute of Technology), Kharagpur - 721302, West Bengal.
- Jadhavpur University, Department of Food and Technology and Biochemical Engineering, 188 Raja S.C Malik Road, Kolkata-200032, West Bengal, Website: www.jadavpur.edu
- Mahatma Gandhi University, Priyadarshini Hills PO, Kottayam-686560, Kerala, Website: www.mguniversity.edu
- Manipur University, Canchipur, Imphal, Manipur,Website: www.manipuruniv.ac.in
- M.S.University, Vadodara-390002, Gujarat, Website: www.msuboroda.ac.in
- National Dairy Research Institute, NDRI Deemed University Karnal-132001, Haryana, Website: www.karnal.nic.in
- National Sugar Institute, P.O: NSI Kalyanpur, Kanpur-208017, UttarPradesh.

క్యాబిన్ క్రూ

క్యాబిన్ క్రూ అంటే విమానంలో పనిచేసే సిబ్బంది. ప్రయాణికులు విమానంలో ఎక్కడానికి ముందు ప్రారంభమై, వారిని సురక్షితంగా చేర్చేంత వరకు కొనసాగుతుంది. సాధారణంగా వారానికి 30 వరకు పనిగంటలు ఉంటాయి. అయితే ఇతర ఉద్యోగుల్లా రోజుకు ఇన్ని గంటలు ఉండే అవకాశం ఉండదు. ఒకే రోజు 20 గంటలు కూడా పనిచేయాల్సి రావచ్చు. అయినా ఒత్తిడిని ఏమాత్రం దరిచేరనీయకుండా చూసుకోవాలి. క్యాబిన్ క్రూలో చేరడానికి సాధారణంగా డిగ్రీని అర్హతగా పరిగణిస్తారు. వయసు 19-27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. కొన్ని ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ సంస్థలు ఇంటర్ పాసైనవారికీ ఉద్యోగాలు ఇస్తాయి. అలాంటివారి వయసు 18-21 సంవత్సరాల మధ్యలో ఉండాలి. హోటల్ మేనేజ్‌మెంట్/ టూరిజం డిప్లొమా ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. ఎయిర్ హోస్టెస్‌లకు ప్రత్యేక శిక్షణ కూడా ఉంటుంది. ఫస్ట్‌ఎయిడ్ తదితరాలను నేర్పిస్తారు. ఇక్కడ పని చేయాలనుకునే వారికి హిందీ, ఇంగ్లీషు భాషలు తప్పనిసరిగా వచ్చి ఉండాలి. పెద్ద పెద్ద సంస్థలు ఎయిర్ హోస్టెస్‌లకు మంచి మొత్తంలో జీతాలుగా ఇస్తాయి.

పారా మెడికల్

సాధారణంగా రోగులు డాక్టర్ల దగ్గరికి వెళ్లిన తరవాత పలు రకాలు టెస్టులు చేయించుకోవాల్సి ఉంటుంది. వీటన్నింటినీ డాక్టర్లు నిర్వహించరు. ఈ విషయంలో పారా మెడికల్ సిబ్బంది సహాయపడతారు. పారా మెడికల్ కోర్సుల్లో ఆప్టోమెట్రీ, ల్యాబ్ టెక్నాలజీ, ఫిజియోథెరపీ, రీహాబిలిటేషన్ మొదలైనవన్నీ ఉంటాయి. ఈ కోర్సుల్లోని చాలా విభాగాల్లో ఉద్యోగ అవకాశాలతో పాటు, స్వయం ఉపాధికి కూడా అవకాశం ఉంటుంది.

ఫోరెన్సిక్ సైన్స్

ఫోరెన్సిక్ అనేది లాటిన్ పదం. ఫోరెన్సిక్ సైన్స్ అనేది నేరాలను శాస్త్రీయంగా నిర్ధారించే శాస్త్రం. ఫిజికల్, మెడికల్, బయోలాజికల్, మెడికల్ తదితర సబ్జెక్టుల నుంచి పుట్టిన శాస్త్రం ఇది. మొదటిసారిగా భారత ప్రభుత్వం 1972లో న్యూఢిల్లీలో లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రిమినాలజీ అండ్ ఫోరెన్సిక్‌సైన్స్(www.nicfs.nic.in)ను ఏర్పాటు చేసింది. ఇది కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఈ సంస్థ ఇప్పటి వరకు వేలాది మందికి ఫోరెన్సిక్ సైన్స్‌లో శిక్షణ ఇచ్చింది. వీరిలో ప్రపంచంలోని 200 దేశాలవారు ఉన్నారు. ఢిల్లీ ఇన్‌స్టిట్యూట్‌తోపాటు కోల్‌కతా, హైదరాబాద్, చండీగఢ్‌లో ఫోరెన్సిక్ లేబొరేటరీలను ఏర్పాటు చేసింది. క్రిమినాలజీలో ఎంఏ, ఫోరెన్సిక్ సైన్స్‌లో ఎమ్మెస్సీ కోర్సును ఎల్ఎన్‌జెపి - ఎన్ఐసిఎఫ్ఎస్ అందిస్తోంది. ఒక్కో దానిలో 20 సీట్లు ఉన్నాయి. ఇక్కడ పీజీ డిప్లొమా ఇన్ డాక్యుమెంటేషన్, ఫోరెన్సిక్ బాలిస్టిక్, ఫోరెన్సిక్ బయాలజీలతోపాటు కొన్ని షార్ట్‌టర్మ్ కోర్సులు కూడా ఉన్నాయి. ఫోరెన్సిక్ సైన్స్‌కు సంబంధించి దేశంలోని పలు యూనివర్సిటీలు వివిధ కోర్సులను అందిస్తున్నాయి. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఏ ఇన్ క్రిమినల్ జస్టిస్ కోర్సు ఉంది. ఏ డిగ్రీ చేసినవారైనా ఈ కోర్సులో చేరొచ్చు. అదేవిధంగా గుజరాత్‌లోని గాంధీనగర్‌లో గుజరాత్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ (www.gfsu.edu.in) కూడా ఉంది.

కోర్సు అందించే కొన్ని సంస్థలు

- Anna University (Chennai 600025) - Post - BE Diploma in Forensic Engineering
- Bundelkhand University (Jhansi 284128)-PG Diploma in Forensic Science
- PG Diploma in Criminology; University of Delhi (Delhi 110007)-Certificate in Forensic Science(3 months)
- Dr. B.R. Ambedkar University(Agra 282004) -MSc(Forensic Science)
- Dr.Hari Singh Gour Vishwavidyalay (Sagar 470003)-MSc. (Criminology), MA (Criminal and Forensic Science).
- Karnataka University (Dharwad-580003)-MA (Criminology and Forensic Science)
- Lucknow University (Lucknow 226007)-PG Diploma in Forensic Anthropology
- University of Madras (Chennai 600005)-MA (Criminology), and MSc. (Forensic Science)
- Osmania University (Hyderabad 500007)-MSc. (Forensic Science Laboratory)
- Panjab University(Chandigarh 160014)-PG Diploma in Forensic Science and Criminal Science.
  1- Punjabi University (Patiala 147002) - MSc(Forensic Science)
- Amity University (Sector 44, Noida-UP) BSc. and MSc. (Forensic Science).

ఫిజికల్, కెమికల్ అండ్ ఎర్త్ సైంటిస్టులు

ఇంజనీరింగ్ ద్వారా కెమికల్ ఇంజనీరింగ్ చేయవచ్చు. బీఎస్సీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చేసిన వారికి కూడా కెమికల్‌కు సంబంధించిన స్పెషలైజ్డ్ డిప్లొమాలు ఉన్నాయి. జేఎన్‌టీయూ, ఆంధ్రా, ఓయూలలో కొన్ని కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. ఫిజిక్స్, మేథ్స్‌లో కూడా ఇలాంటి కోర్సులు ఉన్నాయి. డిగ్రీ/పీజీల్లో జాగ్రఫీ సబ్జెక్టులు చదివిన వారు జియాలజిస్టులుగా వెళ్లవచ్చు. ఓషనోగ్రఫీకి సంబంధించిన కోర్సులు ఆంధ్రా యూనివర్సిటీలో ఉన్నాయి. కెమికల్ ఇండస్ట్రీ, ఫిజిక్స్ అండ్ అలైడ్ ఫీల్డ్‌లో ఉపాధి ఉంటుంది. మేథమెటీషియన్స్ అండ్ స్టాటిస్టీషియన్స్, జియాలజిస్టులుగా, జాగ్రఫీ అండ్ జాగ్రఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ స్పెషలిస్టులుగా, మెట్రోలాజిస్టులుగా, ఓషనోగ్రాఫర్లుగా అవకాశాలుంటాయి.

ఆర్కిటెక్చర్ & కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ

మేథ్స్‌తో ఇంటర్ పూర్తిచేసినవారు ఇందులో ఇంజనీరింగ్ చేయవచ్చు. టెన్త్ తరవాత పాలిటెక్నిక్ డిప్లొమా ఆధారంగా కూడా సర్టిఫికెట్ పొందవచ్చు. ఆర్కిటెక్చర్, నేవల్ ఆర్కిటెక్చర్, కన్‌స్ట్రక్షన్ రంగాల్లో ఉద్యోగాలుంటాయి.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/cjd3qajలో చదవండి.

మర్చెంట్ నేవీ

ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతులు, దిగుమతులు ఎక్కువ మొత్తం నౌకా రవాణా ద్వారానే జరుగుతున్నాయి. అందుకు కారణం మిగిలిన రవాణాలతో పోలిస్తే ఇది చాలా చౌక. అందుకే ప్రపంచ వ్యాప్తంగా షిప్పింగ్ ఇండస్ట్రీకి మంచి ఆదరణ ఉంది. మర్చెంట్ నేవీలోకి వెళ్లినవారికి అనుకూలతలు, ప్రతికూలతలు రెండూ ఉన్నాయి. కొత్త కొత్త ప్రదేశాలకు వెళ్లడం వీరికి అనుకూలత. అయితే నెలల తరబడి సముద్ర ప్రయాణంలోనే జీవితం గడిచిపోతుంది. కుటుంబ జీవితం కూడా దూరమవుతుంది. నేవిగేటింగ్ ఆఫీసర్, రేడియో ఆఫీసర్, మెరైన్ ఇంజనీర్స్ తదితరాల్లో కెరీర్ వెతుక్కోవచ్చు. ఇప్పటివరకు ఇందులో మహిళలకు అవకాశాలు లేవు. అయితే షిప్ డాక్టర్లు, రేడియో ఆఫీసర్లుగా ఇప్పుడిప్పుడు వారు ఇందులోకి ఎంటర్ అవుతున్నారు. కోల్‌కతాలోని మెరైన్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ముంబైలోని చాణక్యలో చేరాలంటే మాత్రం జెఇఇలో ర్యాంకు సాధించాల్సి ఉంటుంది.

ఇవికాకుండా... మర్చెంట్ నేవీలో శిక్షణ ఇచ్చే సంస్థలు

- Indian Maritime University (T.S. Chanakya), Karave Village, Sector 34, Nerul, Navi Mumbai, Maharashtra 400706, Ph: 022 2770 3876.
- Praveenya Institute of Marine Engineering & Maritime Studies (PRIME), D.No.-1-74-15, Plot No.61/3,Sector 3, MVP Colony, Visakhapatnam, Andhra Pradesh 530017,
- AMET UNIVERSITY, Plot No.135, East Coast Road, Kanathur, Chennai, Tamil Nadu 603112, Ph: 044 2747 2904.
- Commander Ali's Academy of Merchant Navy, Commander Ali's Estates, Survey No.469, Donthi, Shivampet Mandal, Medak District, Telangana 502334.
- Dr.B.R.Ambedkar Institute of Technology, Polytechnic Road, Pahargaon,, Junglighat, Port Blair, Andaman and Nicobar Islands 744103, Ph: 03192 259 693.
- Indian Maritime College, Masilamani Street, T.Nagar, Chennai-600 0178. Ph: 044 2433 6953
- NUSI MARITIME ACADEMY, NUSIWA-DO, Sucaldem,Chinchinim, Salcette-Goa-403715, Ph: 0832 277 3859

(మిగిలిన వివరాలు రేపటి పేజీలో)

నవ్య | చిత్రజ్యోతి

గుడి కోసం ఎన్టీఆర్ విరాళం



చిన్న సాయం చేసి ఆ విషయం ఊరంతా చాటుకుంటున్న రోజులివి. కానీ ఓ మంచి పని కోసం లక్షల రూపాయల విరాళం ఇచ్చి కూడా ఆ విషయం ఎక్కడా ఎవరికీ చెప్పకుండా మౌనంగా వహించి తన ప్రత్యేకత మరోసారి చాటుకున్నారు జూనియర్ ఎన్టీఆర్. విషయం ఏమిటంటే.. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాలోని జగ్గన్న పేటలో ఉన్న వీరభద్రస్వామి దేవాలయానికి ఎన్టీఆర్ రూ. 12.50 లక్షల విరాళం ఇచ్చారు. ఇది ఎప్పుడు ఇచ్చారో కూడా ఎవరికీ తెలీదు. చిన్న ఊరు, చిన్న గుడి కావడంతో ఈ విషయం బయటకు కూడా రాలేదు. అయితే ఇటీవల ఎవరో ఆ గుడికి వెళ్లి అక్కడున్న శిలా ఫలకం మీద జూనియర్ ఎన్టీఆర్ పేరు చూసి ఆ విషయాన్ని సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అందరికీ తెలిసింది. ఎన్టీఆర్ మంచి మనసుకి ఫిదా అయిన నెటిజన్లు ఆయనకు అభినందనలు తెలుపుతూ కామెంట్స్ పెడుతున్నారు.

డబుల్ డోస్... దిమాకీ కిరికిరి



రామ్ పోతినేని, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన బ్లాక్ బస్టర్ 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా వస్తున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. హీరో పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ 'దిమాకీ కిరికిరి' పేరుతో టీజర్ విడుదల చేశారు. ఇందులో రామ్ ఇస్మార్ట్‌నెస్, కావ్యా థాపర్ పరిచయం, సంజయ్‌దత్ పవర్‌ఫుల్ ఎంట్రీ అలరించాయి. అద్భుత శివలింగం, క్లైమాక్స్ ఫైట్ .. భారీ జనసమూహం కూడా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాలో కూడా స్పిర్చువల్ టచ్ ఉంటుందని హింట్ ఇచ్చారు దర్శకుడు పూరి. హైదరాబాద్ యాసలో రామ్ చెప్పే డైలాగులు, మాస్ యాక్షన్ ప్యాక్డ్ అవతార్ అలరించాయి. డబుల్ ఎనర్జీ, డబుల్ ఫన్‌తో ఈ సినిమా ఉంటుందని టీజర్ చూడగానే అర్థమవుతుంది.

తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయడానికి నిర్మాతలు పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ సన్నాహాలు చేస్తున్నారు.



వినోదానికి తెర

- నెలాఖరు దాకా సింగిల్ స్క్రీన్ థియేటర్ల మూత

పరీక్షల సీజన్.. ఇండియన్ ప్రీమియర్ లీగ్, సార్వత్రిక ఎన్నికలు.. ఇలా అన్నీ ఒకేసారి రావడంతో థియేటర్లకు వెళ్లే జనమే కరువయ్యారు. మినిమం ఆక్యుపెన్సీ కూడా లేకపోవడంతో నష్టాలను తట్టుకోలేక కొన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్లు దాదాపు రెండు వారాల పాటు మూతపడనున్నాయి. పెద్ద సినిమాలేవీ ఇప్పట్లో లేకపోవడం, చిన్న సినిమాలను చూసేందుకు ప్రేక్షకుడు ఆసక్తి చూపకపోవడం వల్ల రోజురోజుకీ థియేటర్లలో ఆక్యుపెన్సీ తగ్గిపోతోంది. ఈ కారణంగానే ఈనెల 17 నుంచి నెలాఖరు వరకూ థియేటర్లను స్వచ్ఛందంగా మూసేయ్యాలని కొంతమంది థియేటర్ యజమానులు నిర్ణయించుకున్నారు. తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్‌కు, ఈ నిర్ణయానికీ ఎలాంటి సంబంధం లేదని, ఇప్పట్లో పెద్ద సినిమాల విడుదల లేకపోవడంతోనే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని ఓ ఎగ్జిబిటర్ వెల్లడించారు. రోజువారీ ఖర్చులు కూడా గిట్టుబాటు కాని పరిస్థితుల్లో నష్టాలను తగ్గించు కోవడానికి థియేటర్ రన్ తాత్కాలికంగా ఆపడం తప్ప వేరే మార్గం లేదని ఆయన వాపోయారు. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం బాధాకరమే అయినా తప్పడం లేదని మరికొంత మంది థియేటర్ యజమానులు చెప్పారు.

నష్టాలు వస్తున్నా మొండిగా నడుపుతున్నాం

అయితే తాము థియేటర్లను మూత వేయడం లేదని ఆర్‌టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సుదర్శన్ థియేటర్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. నాలుగు షోలకు బదులుగా ఐదు షోలు వేయబోతున్నామని చెప్పారు. కొన్ని థియేటర్ల యజమానులు మాత్రమే ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చన్నారు. జంట నగరాల్లో, ఆర్‌టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఇలా థియేటర్లు మూత వేస్తున్న వారు ఎవరూ లేరన్నారు. నగర శివార్లు, తాలూకాలలో కొన్ని చోట్ల ఇలా చేస్తుండవచ్చన్నారు. సినిమాలు లేవని థియేటర్ మూత వేస్తే అది థియేటర్ రన్‌పై నెగిటివ్ ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదు, అందుకే మూతేయడం ఇష్టం లేక, కష్టమైనా నడుపుతున్నాం అని సంధ్య థియేటర్ మేనేజర్ మధుసూదన్ తెలిపారు. వీరి బాటలోనే మరి కొంతమంది థియేటర్ల యజమానులు కూడా తమ నిర్ణయాన్ని మార్చుకొని ప్రదర్శనలను కొనసాగించనున్నట్లు తెలిపారు. పెద్ద సినిమాలు రిలీజ్ అవ్వకపోయినా ప్రస్తుతానికి చిన్న సినిమాలనే ప్రదర్శిస్తామని చెబుతున్నారు.

కనీసం పదిమంది ఉండడం లేదు

కనీసం పదిమంది అయినా వస్తేనే షో వేస్తున్నాం. ఇటీవలే విడుదలైన ఒక సినిమాకు మూడు షోలు అలాగే వేశాం. నాలుగో షోకు అంతమంది జనం లేకపోవడంతో రద్దు చేశాం. మల్టీప్లెక్స్‌ల్లో కూడా ఇదే జరుగుతోంది. థియేటర్ దగ్గరకొచ్చాక షో బంద్ అనడంతో కొన్నిసార్లు ప్రేక్షకులతో గొడవలు అవుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో మల్టీప్లెక్స్‌లతో కలిపి 1900 స్క్రీన్లు ఉన్నాయి. దాదాపు అన్నింటిలోనూ ఇదే పరిస్థితి. మిడ్‌రేంజ్ సినిమాలకు కూడా నిర్మాతలు షేర్ గ్యారంటీలు, అడ్వాన్స్‌లు అడుగుతున్నారు. ఇన్ని ఇబ్బందుల మధ్య మేం రిస్క్ చేయాలని అనుకోవడం లేదు. నిర్మాతలు ముందుకు వచ్చి తగిన సహకారం అందిస్తే సినిమాలు ప్రదర్శిస్తాం.

-విజయేందర్ రెడ్డి,
తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్.

భార్యాభర్తల ఈగోల గోల



రాహుల్ విజయ్, శివానీ జంటగా నటించిన 'విద్య వాసుల అహం' వెబ్ సిరీస్ ఈ నెల 17న ఆహాలో స్ట్రీమింగ్ అవుతోంది. మణికాంత్ గెల్లి దర్శకత్వంలో మహేశ్ దత్తా, లక్ష్మీ నవ్య నిర్మించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ .. కొత్తగా పెళ్లయిన విద్య, వాసు అహంకారాన్ని వీడి తమ కాపురాన్ని ఎలా చక్కదిద్దుకున్నారనే ఇతివృత్తంతో సిరీస్‌ను రూపొందించినట్లు చెప్పారు. ఇది కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అనీ, ఇందులోని నాలుగు పాటలను నాలుగు రకాలుగా సంగీత దర్శకుడు కల్యాణీ మాలిక్ కంపోజ్ చేశారని తెలిపారు. హీరోయిన్ శివానీని కూడా ఆయనే రికమెండ్ చేశారని మణికాంత్ గెల్లి చెప్పారు.

హీరో రాహుల్ మాట్లాడుతూ 'ఇదొక క్యూట్ ఈగోస్ ఫన్ ఫిల్మ్. హాయిగా ఫ్యామిలీతో కలసి చూస్తూ ఎంజాయ్ చెయ్యవచ్చు' అన్నారు.

'ఈ టీమ్‌తో నాకు రెండేళ్ల నుంచి అనుబంధం ఉంది. దర్శకుడు మణికాంత్ కథ చెప్పగానే హీరో ఎవరని అడిగాను. రాహుల్ విజయ్ అని చెప్పగానే హ్యాపీగా ఫీల్ అయ్యాను. ఈ ప్రాజెక్ట్ ఒప్పుకొన్న వారం రోజులకి 'కోట బొమ్మాళి' చిత్రం ఓకే అయింది. అలా రెండేళ్లుగా రాహుల్‌తోనే వర్క్ చేస్తున్నాను. ఏ మాత్రం ఈగో లేని వ్యక్తి' అని శివానీ చెప్పారు.

ట్రెండ్ సెట్ చేస్తుంది



'మంత్ర, మంగళ' లాంటి లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో దర్శకుడిగా మంచి విజయాలను అందుకున్నారు ఓషో తులసిరామ్. ఈసారి ఆయన సైకో థ్రిల్లర్ చిత్రం 'దక్షిణ'తో ప్రేక్షకులను భయపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. కల్ట్ కాన్సెప్ట్ మూవీ బేనర్‌పై అశోక్ షిండే ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'కబాలి' ఫేమ్ సాయిధన్సిక ఇందులో లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను దర్శకుడు బుచ్చిబాబు సానా చేతుల మీదుగా యూనిట్ బుధవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ మధ్య కాలంలో నన్ను భయపెట్టిన ట్రైలర్ ఇదే. 'దక్షిణ' చిత్రంతో తులసిరామ్ గారు టాలీవుడ్‌కి మరో ట్రెండ్‌సెట్టర్ సైకో థ్రిల్లర్‌ను ఇవ్వబోతున్నారు' అని ప్రశంసించారు. నిర్మాత మాట్లాడుతూ "దక్షిణ' సినిమా ప్రేక్షకులకు సీట్ ఎడ్జ్ థ్రిల్‌ను ఇస్తుంది. తర్వాతేం జరుగుతుందో అనే ఉత్కంఠను ప్రేక్షకులు అనుభవిస్తారు, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం" అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/6BEI2IA
లో చదవండి.

ఆకులోవగెడ్డను వదిలేశారు

● వంతెన నిర్వహణను పట్టించుకోని ప్రభుత్వం

రేగిడి: వెంకమ్మపేట- కొత్తచెలిగానవలస గ్రామాల మధ్య ఉన్న ఆకులోవగెడ్డ వంతెన, కాలువపై వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం కనబరిచింది. గడచిన ఐదేళ్లలో ఈ కాలువ మరమ్మతులు, వంతెన నిర్వహణపై ఏమాత్రం శ్రద్ధ చూపలేదు. అప్పుడప్పుడు ఉపాధిలో జంగిల్ క్లియరెన్స్ తప్పితే పూర్తి స్థాయి పనులు కనబడలేదు. దీంతో ఈ ప్రాంత రైతులకు ఈ గెడ్డ వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ జరిగినట్టు చెబుతున్నారు. మరోవైపు ఈ గెడ్డ చాలా చోట్ల కోతకు గురై నీరు పొలాల్లోకి చేరుతోంది. ఏమాత్రం వరద వచ్చినా కొత్తచెలిగానవలస, వెంకమ్మపేట, పాతచెలిగానవలస, రేగిడి, ఆమదాలవలస గ్రామాల పరిధిలో పంట మునిగిపోతోంది. మరోవైపు వంతెన శిథిలస్థితికి చేరుకుంది. ఒకవైపు రక్షణ గోడ పాడై భీతిగొల్పుతోంది.


వెంకమ్మపేట వద్ద శిథిలమైన వంతెన

ఆక్రమణలపై చర్యలేవీ?

ఈ గెడ్డ జిల్లాలో సాలూరు దగ్గర ఆకులోవకట్ట అడవి నుంచి రేగిడి మండలం ఒప్పంగి, ఉణుకూరు, ఏవీపురం, వెంకమ్మపేట, చెలిగానవలస, ఆమదాలవలస, రేగిడి మీదుగా ప్రవహించి నాగావళిలో కలుస్తోంది. ఒకప్పుడు ఇది 10 మీటర్ల వెడల్పు ఉండగా... ఇప్పుడు కొన్నిచోట్ల 3 మీటర్లు కూడా లేని పరిస్థితి ఉంది. వెంకమ్మపేట, అంబాడ దగ్గర కొంతమంది చేపల చెరువుల నిర్వాహకులు ఈ గెడ్డను ఆక్రమించినట్టు జిల్లా అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఇంకా అనేక గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది. దీనిపై అధికారులు విచారణ చేసి మిన్నకుండిపోయారు. కానీ ఎటువంటి చర్యలూ లేవు.


ఆక్రమణచెరలో మరమ్మతులు లేని ఆకులోవకట్ట గెడ్డ

ఉన్నతాధికారులకు నివేదించాం

ఆకులోవగెడ్డ ఆక్రమణలు, ముంపు పరిస్థితిని జిల్లా అధికారులకు నివేదించామని రేగిడి ఇరిగేషన్ ఏఈ రాజేష్ తెలిపారు. ఈ కాలువ మరమ్మతులకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని తెలిపారు. నిధులు లేమివల్ల పనులు చేయలేక పోయామని చెప్పారు.

ఉపాధి పనులపై రివ్యూ

రాజాం రూరల్: మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను వేగవంతం చేయాలని, ప్రతి ఒక్కరికీ పని కల్పించే దిశగా సిబ్బంది పనిచేయాలని రాజాం ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. గ్రామాల వారీగా పనుల పురోగతిపై చర్చించారు. ఏయే గ్రామాల్లో ఏయే పనులు చేపడుతున్నారో, భవిష్యత్తులో ఏయే పనులు చేపట్టాల్సి ఉందో వారిని అడిగి తెలుసుకున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రామభద్రపురం: మండల కేంద్రంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు సత్యసాయి భజనమండలి నిర్వాహకులు బెవర అప్పలనాయుడు తెలిపారు. ఈ శిబిరానికి విశాఖ శంకర్ ఫౌండేషన్ వైద్యులు, వైద్య సిబ్బంది హాజరవుతారని, ఈ అవకాశాన్ని నేత్ర రోగు లు వినియోగించుకోవాలని కోరారు.

వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం

తెర్లాం: వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయని స్థానిక గ్రంథాలయ అధికారి సీహెచ్ కృష్ణమూర్తి అన్నా రు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో విశ్రాంత ఎంఈవో సత్యనారాయణ ఈ శిబిరాన్ని ప్రారంభించారని తెలిపారు. అనంతరం పిల్లలకు క్విజ్, వ్యాస రచన, పురాణాలు, ఇతి హాసాలు, కథలు చదివించినట్టు చెప్పారు.

పీవోపై దాడిచేసిన వారిని శిక్షించండి

కలెక్టరేట్: గజపతినగరం నియోజకవర్గంలో విధుల్లో ఉన్న పోలింగ్ అధికారిపై దాడి చేసిన నిపక్షంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు బుధవారం కలెక్టరేట్ ఏవోకి ఫిర్యాదు చేశారు. రాజాం నియోజకవర్గంలో అస్వస్థతకు గురైన ఉపాధ్యాయునికి మెరుగైన చికిత్స నియమిత్తం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రిజర్వుల్లో ఉన్న ఉద్యోగులకు రెమ్యూనిరేషన్ ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. రెమ్యూరేషన్‌తో పాటు ట్రెనింగ్ రోజు కలిసి డ్యూటీ సర్టిఫికెట్ మంజూరు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలోని ఉపాధ్యాయ సంఘనాయకులు ఈశ్వరరావు, శ్యామ్, రాము, రమేష్ చంద్ర పట్నాయక్ ఉన్నారు.

రేషన్ పంపిణీలో జాప్యం

● ఎండీయూ వాహనం చెడిపోవడమే కారణం

రాజాం: పురపాలక సంఘ పరిధిలోని 281, 282, 283 రేషన్ డిపోలకు సంబంధించి ఎండియు వాహన చెడిపోవడంతో రేషన్ పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతుందని వినియోగదారులు వాపోతున్నారు. నిబంధనలు ప్రకారం ఈనెల 17 తేదీలోగా రేషన్ పంపిణీ పూర్తిచేయవాల్సి ఉండగా ఇంతవరకు 70 శాతం మాత్రమే పూర్తయిందని మిగిలిన వినియోగదారులకు ఇంతవరకు రేషన్ సరుకులు అందక పోవడంతో ఎదరు చూస్తున్నారు. పురపాలక సంఘ పరిధిలోని కాలేపువీది. గాంధీనగర్. బాబానగర్. నర్సింహనాయుడు కాలనీ. తెలగవీధికి చెందిన 1300 కార్డులకు గాను 830 కార్డులకు మాత్రమే అందజేశారు. అది కూడా రేషన్ డిపోలకు వెళ్లి సరుకులు తీసుకోవాల్సి వస్తుందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎండియు వాహన చెడిపోయింది మరమ్మత్తులు చేయడానికి సమయం పడుతుందని అందుకు వినియోగదారులు రేషన్ డిపోలు వద్దకు వెళ్లి సరుకులు తీసుకోవాలని విఆర్‌ఓలు. వార్డు వాలంటీర్లు ద్వారా ముందుగా సమాచారం అందించడంతో 70 శాతం వరకు వినియోగదారులు రేషన్‌సరుకులు డిపోలకు వెళ్లి తీసుకున్నారు. అయితే డిపోలకు వెళ్లి రేషన్ తీసుకోవాలంటే డిపోలు దూరంగా ఉన్నాయని అందుకు సరుకులు ఇంటికి పంపించాలని వినియోగదారులు కోరుతున్నారు.

● **వాహనం చెడిపోవడంతోనే..**

రేషన్ సరుకులు పంపిణీ విషయంలో జాప్యం జరిగిన విషయంపై సిఎస్‌డిటి ఎ చిరంజీవి వద్ద ప్రస్తావించగా ఎండియు వాహన చెడిపోవడం వలన జాప్యం జరిగందని ఈ విషయంపై వాలంటీర్లు .విఆర్‌ఓలు ద్వారా వినియోగదారులకు సమచారం అందించామని అయినా కొంతమంది డిపోలకు వెళ్లి తీసుకోక పోవడంతో జాప్యం జరుగుతుందని వినపియోగదారులు అందరికి సరుకులు అందించేలా చర్యలు తీసుకుంటాం.

దాసరి బంద అన్యాక్రాంతం


దాసరి బంద కాలువపై అక్రమంగా కల్వర్టులు నిర్మిస్తున్న దృశ్యం

తెర్లాం: తెర్లాంలో గల దాసరి బంద కాలువపై అక్రమ కట్టడాలు మొదలయ్యాయి. ఈ కాలువ గ్రామానికి ఆనుకొని ప్రధాన రహదారికి మధ్యలో ఉండటంతో ఆక్రమణదారులు దీనిపై కన్నేశారు. ఈ కాలువపై పెద్ద కల్వర్టుల నిర్మాణానికి పూనుకున్నారు. చింతల వేంకటేష్, కోట అప్పలనాయుడు కలసి ఒక పెద్ద కల్వర్టు నిర్మిస్తున్నారు. దీనిపై స్థానిక రైతులు స్పందించి.. అక్రమ కట్టడాలను నిరోధించాలని బొబ్బిలి రెవెన్యూ డివిజినల్ అధికారికి ఫిర్యాదు చేశారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి... అక్రమ కట్టడాలను అడ్డుకోవాలని వారు కోరుతున్నారు. దీనిపై పంచాయితీ ఈవో సూరిబాబు స్పందిస్తూ ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశామని... దీనిపై తహశీల్దారుకు, ఎంపీడీవోకు నివేదిక ఇచ్చామని చెప్పారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.

మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం

వంగర: పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం మొ క్కలు పెంపకానికి పాధాన్యం ఇస్తున్నా, వాటి సంరక్షణపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. నిర్వహణ పేరిట రూ. లక్షలు ఖర్చు చేస్తు కాలయాపన చేస్తున్నారు. వంగర మండలం లోని మద్దువలస పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారి పక్కన నాటిన మొక్కలకు నిప్పుపెట్టడంతో కాలిపోయాయి. దీంతో ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇదే తరహాలో సీతారాంపురం, తలగాం, శ్రీహరిపురం లో సైతం ఇటీవల మొక్కలు కాలిపోయాయి.

తప్పిన పెను ప్రమాదం

● సెంచూరియన్ యూనివర్సిటీ బస్సును ఢీకొన్న టిప్పర్ లారీ
● పది మంది విద్యార్థులతో పాటు ఇద్దరి డ్రైవర్లకు గాయాలు
రెండు కిలోమీటర్ల మేర స్తంభించిన ట్రాఫిక్

బొండపల్లి: బొండపల్లి సమీపంలో పెను ప్రమాదం తప్పింది. ఇక్కడ జాతీ యరహదారిపై బుధవారం ఉదయం సెంచూరియన్ యూనివర్సిటీ బస్సును, టిప్పర్‌లారీ ఢీకొంది. దీంతో పది మంది విద్యార్థులతో పాటు ఇద్దరు డ్రైవర్లు గాయపడ్డారు. ఎస్‌ఐ కె.లక్ష్మణరావు కథనం మేరకు.. గజపతినగరం నుంచి బొండపల్లి మండలంలోని రోళ్లవాక సమీపం లోగల సెంచూరియన్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు బస్సులో కళాశాలకు వెళ్తున్నారు. బొండపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాలు నుజ్జునుజ్జు కాగా బస్సు డ్రైవర్ కృష్ణంరాజు రెండు కాళ్లు, లారీ డ్రైవర్‌కు ఒక కాలు విరిగిపోయాయి. అలాగే బస్సులో ప్రయాణిస్తున్న గజపతినగరం మండలంలోని లోగిస గ్రామానికి చెందిన ఇజ్జిరోతు వసంతకుమారికి కాలు విరిగిపోగా, మిగిలిన తొమ్మిది మంది విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం మేరకు బొండపల్లి ఎస్‌ఐ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హుటాహుటిన తీవ్రంగా గాయపడిన ముగ్గురుని విజయనగరం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి, మిగిలిన క్షతగాత్రులను గజపతినగరం సీహెచ్‌సీకి తరలించారు. ప్రమాదం జరిగిన ఘటనా స్థలంలో ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. గజపతినగరం సీఐ ప్రభాకరరావుతోపాటు బొండపల్లి ఎస్‌ఐ, సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




నుజ్జునుజ్జయిన వాహనాలు, గాయపడిన డ్రైవర్, విద్యార్థులు

నేను చచ్చిపోయినా పర్వాలేదు

ప్రమాదంలో రెండుకాలు విరిగి వాహనంలో బస్సు డ్రైవర్ కృష్ణంరాజు చిక్కుకున్నాడు. ఈ సమయంలో నేను మరణించినా పర్వాలేదు, విద్యార్థులు సుఖంగా ఉండాలని, ఐడోంట్‌కేర్ అంటూ ఆయన పేర్కొన్నాడు.

వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరం ప్రారంభం


విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ ఇస్తున్న దృశ్యం

విజయనగరం రింగురోడ్డు: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం రామనారాయణంలో ఈ నెల 17 వరకూ మూడు రోజుల పాటు జరగనున్న వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరం బుధవారం ప్రారంభమైంది. ప్రముఖ రచయిత తవాస్మీ, మనస్వి, తపస్వి, బెంగుళూరుకు చెందిన శ్రీరామచక్రధర్ పిల్లలకు, పెద్దలకు ఉన్న స్థాయి నుంచి ... ఉన్నత స్థాయికి ఎదగడానికి అవసరమయ్యే వ్యక్తిత్వ వికాసపు సూత్రాలు వివరించారు. ఈ శిబిరంలో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా ఆలయ అర్చకులు చాణక్య, హర్ష శాంతి ఆశీర్వచనాలతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. ఈ శిబిరంలో ఎన్‌సీఎస్ ట్రస్టు సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, చీఫ్ ఆడిటర్ బాలాజీ, ఉమాదేవి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో జాప్యంచేయవద్దు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

రాజాం: ఉపాధి పనుల్లో జాప్యం చేయవద్దని పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సిబ్బంది చర్యలు తీసుకుని అన్ని పంచాయతీల్లోను పనులు త్వరగా చేపట్టేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పనులు చేపట్టిన ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. టెంట్‌లు, మంచినీటి సదుపాయం, అవసరమైతే మజ్జిగను ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయంలో ఎవరు జాప్యం చేసినా చర్యలు తీసుకోడం జరుగుతుందన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున కూలీలు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పనులు జరుగుతున్న ప్రాంతాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయడం జరుగుతుందని, కనీస సౌకర్యాలు లేకపోతే ఫీల్డ్ అసిస్టెంట్‌లపై చర్యలు తీసుకుంటామన్నారు.

'గార'కు సత్కారం

రాజాం: రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం కుటుంబ సభ్యులను రాజాం తూర్పుకాపు సంక్షేమ సంఘం బుధవారం ఘనంగా సత్కరించింది. ఈయన రచించిన 'రాయరత్నం మంజూష'కు గాను వరంగల్‌కి చెందిన శ్రీలేఖ సాహితీ సంస్థ చెన్నమనేని రంగనాయకమ్మ విశిష్ట అద్వైత సాహితీ పురస్కారం ఏర్పాటు చేసింది. ఈ పురస్కారాన్ని ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఇటీవల హైదరాబాద్‌లో అందుకున్నారు. ఈ పురస్కారం అందుకున్నందుకు తూర్పుకాపు సంక్షేమ సంఘం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు గార రవిప్రసాద్, సంఘం అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, ఆర్‌వీజే నాయుడు, శాసపు వేణుగోపాల్ నాయుడు, పాలవలస శ్యామ సుందరరావు, డోల వాసు, వల్లూరు సన్యాసినాయుడు, బాలమురళీ, ఎన్నిరాజు తదితరులు పాల్గొన్నారు.


గార రంగనాథంను సత్కరిస్తున్న తూర్పుకాపు సంక్షేమ సంఘం నాయకులు

200 ఎకరాల్లో హార్టికల్చర్ అభివృద్ధి

రామభద్రపురం, మే 15: మండలంలో 200 ఎకరాల్లో ఈ ఏడాది హార్టికల్చర్‌ను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ టి.జనార్దన్ తెలిపారు. మండల ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వీటిలో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు వంద ఎకరాల్లో తోటల పెంపకం చేపట్టనున్నట్టు తెలిపారు. వంద రోజుల పని కోసం ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జిత్రినాథరావు, ఈసీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీడీ జనార్దన్

హోంగార్డు కుటుంబానికి సాయం


హోంగార్డు కుటుంబానికి ఆర్థిక చేయూత చెక్కును అందిస్తున్న ఎస్పీ

విజయనగరం క్రైం, మే 15: జిల్లా పోలీసు శాఖలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ పార్వతీపురం- మన్యం రవాణా శాఖ విభాగంలో విధులకు హాజరై, గుండెపోటుతో మృతి చెందిన కె.మహేశ్వరరావు కుటుంబానికి ఎస్పీ దీపిక, హోంగార్డులు చేయూతగా ఒక్క రోజు అలవెన్సు రూ.3 లక్షల 20 వేల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ ప్రభాకరరావు, హోంగార్డు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై గవర్నర్ జోక్యం చేసుకోవాలి

విజయనగరం దాసన్నపేట: రాష్ట్రంలో ఎన్నికల అనంతరం పల్నాడు, రాయలసీమ జిల్లాల్లో జరుగుతున్న దాడులపై గవర్నర్ జోక్యం చేసుకోవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. బుధవారం ఆర్ అండ్ బీ సమీపంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడిచిన రెండు రోజులుగా రాష్ట్రంలో హింసాత్మక సంఘటనలకు అంతులేకుండా పోయిందని అన్నారు. మాచర్లలోని రెంటాల, చంద్రగిరి, తాడిపత్రి, జమ్మలమడుగు, పలాస మండలం అమలకుడియా ప్రాంతాల్లో అభ్యర్థులు, ప్రజలపై జరిగిన దౌర్జన్యాలు, దాడులు చూసి విస్తుపోతున్నామన్నారు. రాజకీయ పార్టీల ముఖ్య నేతలు కూడా రాష్ట్రంలో శాంతిభద్రతలకు నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నాగభూషణం, నాగేశ్వరరావు, రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బాబ్జీ

క్షయవ్యాధి నివారణకు బీసీజీ టీకాలు

కొత్తవలస, మే 15: క్షయ వ్యాధి నివారణకు కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది గురువారం నుంచి 18 సంవత్సరాల పైబడిన వారందరికి బీసీజీ టీకాలను వేస్తున్న ట్టు సీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్ వర్మ తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో గల 13 కేంద్రాల ద్వారా రోజుకు 70 మంది చొప్పున ఒక్కొక్క బృందం 500 మందికి టీకాలు వేస్తుందని తెలిపారు. గతంలో క్షయతో బాధ పడిన వారి కుటుంబ సభ్యులు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, 60 ఏళ్ల దాటిన వారు, బీసీజీ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని తెలిపారు.

రేపు విద్యుత్ కోతలు

లక్కవరపుకోట: ఎల్.కోటలో గల విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ కారణంగా ఉదయం 7 నుంచి 12 గంటలవరకూ విద్యుత్‌కోతలు అమలు చేస్తున్నట్టు విజ యనగరం రూరల్ ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. ఈ కారణంగా ఎల్.కోట, సంతపేట, రంగారాయపురం, సోంపురం జంక్షన్, ఖాసాపేట, తలారి, కొట్యాడ, ఎల్‌కే ఎస్.పురం, గొల్జాం, పాటూరు, ఓబులయ్యపాలెం, ము కుందపురం, బొద్దాం, కొత్తబొద్దాం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఈ విషయం ప్రజలు గమనించాలని కోరారు.

'తాటిపూడి' వద్ద అక్రమ నిర్మాణాలు

శృంగవరపుకోట రూరల్: ముషిడిపల్లి ప్రాంతంలో రూ.కోట్లు విలువ చేసే పీడబ్ల్యూడీ (ప్రభుత్వ జల వనరుల శాఖ) స్థలాల్లో కొందరు ఇళ్ల నిర్మిస్తుంటే... ఈ పైప్‌లైన్ ను ఆనుకొని పొలాలు ఉన్న వారు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇందులో కొందరు పెద్ద వ్యక్తులు ఆ శాఖ సిబ్బంది సాయంతో చక్కగా నిర్మాణాలు పూర్తి చేసుకుంటున్నారు. విజయనగరానికి చెందిన ఒక కీలక వ్యక్తి తన పొలంలోకి వెళ్లేందుకు ఏకంగా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి దారి నిర్మించేశారు. ఆ వ్యక్తి కొన్న పొలానికి వెళ్లే దారిలేక ఎన్నో అవస్థలు పడుతున్న తరుణంలో ఈ సార్వత్రిక ఎన్నికలు వారికి బాగా కలిసొచ్చాయని స్థానికులు అంటున్నారు. కొందరు విశాఖ జీవీఎంసీ పైప్‌లైన్‌ను సైతం ఆక్రమించుకున్నారు. పేదవాడు పాక నిర్మిస్తేనే నానా యాగిచేసే అధికారులు పెద్దలు చేస్తే మాత్రం ఎందుకు ప్రశ్నించడం లేదని వాపోతున్నారు. ఈ అక్రమ నిర్మాణాల విషయంపై ఇరిగేషన్ శాఖ జేఈ తమ్మినాయుడును వివరణ కోరగా.. ఎన్నికల హడావుడి పూర్తయ్యాక పరిశీలించి చర్యలు చేపడతామని తెలిపారు.


తాటిపూడి ఇరిగేషన్ స్థలంలో నుంచి తన పొలంలోకి రోడ్డువేసిన ఓ వ్యాపారి

నీలమాంబపురంలో దొంగతనం

జియ్యమ్మవలస: మండలంలోని నీలమాంబపురం గ్రామానికి చెందిన పురోహితుడు కర్రి సతీష్ ఇంట్లో దొంగతనం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తన మేనమామ ఈనెల 10న మృతి చెందడంతో సతీష్ కుటుంబ సభ్యులు రంపచోడవరం వెళ్లారు. మూడు రోజులపాటు అక్కడే ఉండి ఈనెల 13న ఇటిక గ్రామంలో తన ఓటు వేసుకుని ఇంటికి వచ్చి చూడగా తాళంతీసి ఉండడాన్ని గుర్తించారు. గదిలో ఉన్న బీరువా తాళం విరగ్గొట్టి 8 తులాల బంగారం, సుమారు రూ. 5 లక్షలకు పైబడి నగదు చోరీకి గురైనట్టు జియ్యమ్మవలస పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఎస్‌ఐ పి.అనీష్ కేసు నమోదు చేశారు. బుధవారం పాల కొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, చినమేరంగి సీఐ పి.మంగరాజు, ఎస్‌ఐ అనీష్‌లు పోలీస్ క్లూస్ టీమ్‌తో నీలమాంబపురంలో పరిశీలించారు.


వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

చీపురుపల్లి: పట్టణంలోని మెయిన్ రోడ్డులో మంగళవారం రాత్రి ఐవోబీకి చెందిన ఏటీఎంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి విఫలయత్నం చేశారు. పోలీసుల కథనం మేరకు పాత పెట్రోల్ బంకుకు సమీపంలో ఐవోబీ బ్రాంచ్‌కు ఆను కొని ఏటీఎంను ఏర్పాటు చేశారు. మంగళవారం అర్ధ రాత్రి సమయంలో కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎంను పగలగొట్టి చోరీకి యత్నించినట్లు అక్కడఆనవాళ్లను స్థానికులు గమనించారు. అందిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


కింద భాగంలో డోర్ తెరిచి ఉన్న ఐవోబీ ఏటీఎం

మతిస్థిమితం లేని మహిళ మృతి

రాజాం రూరల్ (బొబ్బిలి): మండల పరిధిలోని రాముడువలస-కంబరవలస గ్రామాల సమీపంలోని మామిడితోటలో మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లు బొబ్బిలి సీఐ నాగేశ్వర్రావు తెలిపారు. మృతురాలు పైడితల్లి(60)ది పార్వతీపురం మండలం చిన బొండపల్లి గ్రామమని పేర్కొన్నారు. బొబ్బిలి మండలం కొండదేవుపల్లి గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చిన ఆమె తిరిగి వెళ్తూ మార్గమధ్యలో మృతిచెంది ఉండవచ్చన్నారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్బీకేలో దొంగతనం

మక్కువ: మండలంలోని కాశీపట్నం పంచాయతీ రైతు భరోసా కేం ద్రంలో దొంగతనం జరిగింది. ఎస్‌ఐ పి.నరసింహమూర్తి కథనం మేరకు.. ఆర్బీకేలోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ గొట్టాపు సతీష్ కుమార్ ఈనెల పదో విధులు ముగించి తాళం వేసి వెళ్లిపోయాడు. ఈనెల 14న కార్యాలయానికి వచ్చి చూడగా గదిలో సాంసంగ్ టీవీ, హెచ్‌పీ ప్రింటర్, హెచ్‌పీ మోనటర్ కనిపించలేదు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేయాలి

రాజాం రూరల్ (బొబ్బిలి): సార్వత్రిక ఎన్నికలలో పాల్గొన్న వెకేషన్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్లను తక్షణమే జారీ చేయాలని ఏపీటీఈఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జె.సి.రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక్కడి ఎన్‌జీఓ హోమ్‌లో బుధవారం నిర్వహించిన జోనల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నిబంధనల ప్రకారం వేసవి సెలవుల్లో ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు శిక్షణ తరగతులు, విధుల్లో ఎన్ని రోజులు పాల్గొంటే ఆ మేరకు దామాషా పద్ధతిలో సంపాదిత సెలవులకు అర్హులని ఆయన గుర్తు చేశారు. ఈ మేరకు డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేసేలా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఇవ్వాలని రాజు డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ పద్మావతి, జిల్లా గౌరవ అధ్యక్షులు జోగినాయుడు, సీపీఎస్ ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అసౌకర్యాలతో ఆర్టీసీ కాంప్లెక్స్


అసౌకర్యాల నడుమ పాచిపెంట ఆర్టీసీ కాంప్లెక్స్

పాచిపెంట, మే 15 : మండల కేంద్రం శివారున గల ఆర్టీసీ కాంప్లెక్సు లో నిండా అసౌకర్యాలే కనిపిస్తున్నాయి. ఆర్టీసీ బస్సులు కాంప్లెక్సుకు రాకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాంప్లెక్సు ఆవరణలో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బాత్ రూములు, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ లేక మూలనపడ్డాయి. కాంప్లెక్సు లోపల ఏర్పాటు చేసిన స్టాల్స్ కూడా మూతబడి ఉన్నాయి. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు కాంప్లెక్సుకు వెళ్లకుండా కిలో మీటరు దూరాన గల పాత బస్టాండ్ వద్ద నిలిపి వేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో పాత బస్టాండ్ వద్ద బస్సు దిగి గ్రామ శివారుకు వెళ్లేందుకు ప్రయాణికులు లగేజీలతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. కాంప్లెక్సు వద్ద రాత్రయితే విద్యుత్ వెలుగులు లేక కటిక చీకటిగా ఉంటుంది.

పర్యవేక్షణ లేక.. నిర్వహణకు నోచుకోక

- ఆరుబయట పేరుకుపోతున్న చెత్త
- ఇదీ వీరఘట్టంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిస్థితి

వీరఘట్టం

వీరఘట్టం పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణ నీరుగారుతోంది. ప్రధానంగా పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోపాటు సమర్థంగా నిర్వహణకు చర్యలు తీసుకోకపోవడం వల్ల చెత్త కుండీలు, లక్షలాది రూపాయలతో ఏర్పాటుచేసిన పరికరాలు మూలకు చేరాయి. వీరఘట్టం పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి టీడీపీ హయాంలో 2017 రాష్ట్రస్థాయి పురస్కారం దక్కిన విషయం విదితమే. అప్పట్లో తడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఎరువు తయారు చేసేవారు. వాటి అమ్మకాల్లో పంచాయతీకి ఆదాయం సమకూరేది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లలో నిర్వహణ పూర్తిగా గాడితప్పింది. ప్రస్తుతం చెత్త నుంచి సంపదను సృష్టించే పరిస్థితి కనిపించడం లేదు. చెత్తను ఆరుబయట పారబోస్తున్నారు. దీంతో కుళ్లి దుర్వాసన వస్తోందని చుట్టుపక్కల ప్రజలు వాపోతున్నారు. కంపోస్టు తయారీ కూడా నామమాత్రంగానే చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి పూర్తిస్థాయిలో చెత్త నుంచి ఎరువులు తయారు చేసి పంచాయతీ ఆదాయం పెంచడంపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.


ఘనవ్యర్థాల నుంచి సంపద తయారీ కేంద్రం


నిరుపయోగంగా మారిన చెత్త కుండీలు


ఆరుబయట పేరుకుపోయిన చెత్త

ముగిసిన శ్యామల యాగం


పూజలు నిర్వహిస్తున్న విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లా కేంద్రంలో ఉన్న సర్వ మంగళదేవీ పీఠంలో జరుగుతున్న శ్యామల యాగం బుధవారం పూర్తయింది. పీఠాధిపతి మురపాక కాళిదాసు శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్వతీపురం నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి బోనెలవిజయచంద్ర ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బెలగాం జయ ప్రకాష్‌నారాయణ, మజ్జి కృష్ణమోహన్, జి.రవికుమార్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు. కాగాసర్వ మంగళదేవి పీఠంలో జరిగిన ప్రత్యేక పూజల వల్ల తమ పార్టీకి మంచి ఫలితాలు రాబోతున్నాయని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు తెలిపారు. కార్యక్రమానికి బుధవారం ఆయన హాజరుకావలసిఉండగా, అనివార్య కారణాల వల్ల పాల్గొనలేకపోయారు. దీంతో వీడియో కాల్ ద్వారా అచ్చెన్నాయుడు మాట్లాడారు. ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమని సర్వమంగళదేవి పీఠాధిపతి మురపాక కాళిదాసు శర్మయాజీ తెలిపారు.

ముమ్మరంగా వరి కోతలు


గురండిలో వరి కంకులను నూర్చుతున్న యంత్రం

భామిని: మండలంలో రబీలో సాగుచేసిన వరి పంట చేతికి రావడంతో కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. గురండి, నేరడి, కాట్రగడ, బత్తిలి ప్రాంతాల్లో సుమారు 500 ఎకరాల వరకు వ్యవసాయ బోర్లు ద్వారా సాగుచేశారు. అయితే పంటను యంత్రాల ద్వారా కోస్తుండగా, ధాన్యం పెద్దాపురం ప్రాంతం నుంచి మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. కళ్లాలు, పంటపొలాలు వద్దే 81 కేజీల బస్తా రూ.1360కు కొనుగోలు చేస్తున్నారు. ఎకరాకు సుమారు 35 బస్తాలు దిగుబడి రాగా వాటికి 25 వేల రూపాయలు వరకు కోత, మోత, నూర్పుకు మదుపు కాగా ఎకరాకు రూ.20 వేలు ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వానికి విక్రయించడానికి రైతులు ఆసక్తి చూపడం లేదు. ఈ-క్రాప్ బుకింగ్, ధాన్యం మస్తర్ వంటి నిబంధనల వల్ల వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

దోమల నివారణ మందు పిచికారీ


కీసరలో దోమల నివారణ మందు పిచికారీని పరిశీలిస్తున్న డీఎంవో జగన్మోహన్‌రావు

గుమ్మలక్ష్మీపురం: కీసర, కీసరగూడ గిరిశిఖర గ్రామాల్లో దోమల నివారణ మందులు పిచికారీని (ఐఆర్ఎస్) జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. జగన్మోహన్ రావు బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంవో డి.సూర్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి మోహన్‌రావు, పంచాయతీ కార్యదర్శి పి.లక్ష్మి, మలేరియా సాంకేతిక సూపర్‌వైజర్ అప్పలనాయుడు, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ రాధాకృష్ణ, ఏఎన్ఎం ప్రభావతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శివరాంపురం కార్యదర్శి మృతి

సాలూరు రూరల్: శివరాంపురం పంచాయతీ కార్యదర్శి మర్రి రాజశేఖర్ బుధవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. కొద్దిరోజుల కిందట తండ్రి మర్రి విశ్వేశ్వరరావు మృతిచెందిన విషయం విదితమే. వారి సొంతిల్లు మూసివేయాల్సిరావడంతో విజయనగరం జిల్లా రామభద్రపురంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఇటీవల పని ఒత్తిడి నేపథ్యంలో ఆకస్మికంగా గుండెపోటు రావడంతో ఇంటి వద్దే కుప్పకూలిపోయాడు. ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శిగా సాలూరు మండలంలోని కొత్తవలస, పెదబోరబంద తదితర పంచాయతీల్లో 21 ఏళ్లుగా సేవలందిస్తున్నారు.

వెబ్ కెమెరాలు పార్వతీపురం తరలింపు

సాలూరు రూరల్: సాలూరు నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణలో వెబ్ కెమెరాలు కీలక పాత్రను పోషించాయి. 243 పోలింగ్‌స్టేషన్లకు గాను 101 పోలింగ్‌స్టేషన్లలో వీటిని ఏర్పాటు చేశారు.కాగా పోలింగ్ అనంతరం వీటిని తీసి బుధవారం జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారు.

పైపులైన్లకు లీకులు..తాగునీరు వృథా


సిరిపురం వద్ద వృథాగా పోతున్న తాగునీరు

గంట్యాడ: మండలంలోని పలు గ్రామాలకు గోస్తాని నీటి పథకం ద్వారా తాగునీరు సరఫరాఅవుతోంది.సిరిపురం సమీపంలో, చంద్రంపేట వద్ద పైపలైన్లు లీకులు కావడంతో తాగునీరు వృథాగా పోతోంది. తక్షణమే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైపులైన్లకు లీకులు అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

పొంచిఉన్న ప్రమాదం


కొత్తవలస ఆనకట్టపై రక్షణ గోడలేని దృశ్యం

మక్కువ: మక్కువ-సీతానగరం మండలాల సరిహద్దు ప్రాంతంలోని సువర్ణముఖి నదిపై గల కొత్తవలస ఆనకట్టు రహదారిలో ప్రమాదంపొంచిఉంది. మక్కువ నుంచి పార్వతీపురం చేరుకునేందుకు దగ్గర మార్గం కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కాజ్‌వే, రక్షణ గోడ లేకపోవడంతో వాహనాలు అదుపు తప్పితే రహదారిపై నుంచి బండ రాళ్లపైకి బోల్తాపడే అవకాశముంది. కాంగ్రెస్‌హయాంలో శత్రుచర్ల విజయరామ రాజు అటవీశాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఆనకట్టపై కాజ్‌వే నిర్మాణానికి ప్రతిపాదన జరిగాయి.అప్పట్లో నిధులు సరిపోకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఇప్పటికైనా ఆనకట్టపై కాజ్‌వే నిర్మాణానికి చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

పోలింగ్ అధికారికి గాయాలు



రాయగడ: పోలింగ్ విధుల ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తున్న అధికారి జనార్దన పట్నాయక్ ద్విచక్రవాహనం చెట్టుకు ఢీకొనడంతో గాయపడ్డాడు.గుణుపురానికి చెందిన పట్నాయక్ కళ్యాణ సింగుపూర్‌లో ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. విధులు ముగించు కుని బుధవారం ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా చెట్టును ఢీకొన్నారు. ఈ మార్గంలో వేచిఉన్న ప్రయాణికులు అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో జిల్లా కేంద్రఆసుపత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం విశాఖపట్నం తరలించారు.

అకాల వర్షాలతో అన్నదాతకు అవస్థలు

- తడిసిన మొక్కజొన్నపంట
- ఆందోళన చెందుతున్నరైతులు


లింగాలవలసలో తడిసిన మొక్కజొన్న కంకులు ఎండబెట్టిన దృశ్యం

గజపతినగరం

అకాలవర్షాలు అన్నదాతలను అగచాట్లకు గురిచేశాయి. ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న తదితర పంటలు తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికి వచ్చిన మొక్కజొన్న కంకులు తడిసిపోవడంతో కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. మొక్కజొన్న పంటకల్లాల్లోనే ఉండిపోవడంతో పంటసాగుకు చేసిన అప్పులు చెల్లించేందుకు, ఇతర ఆర్థిక అవసరాలకు రైతులు ఇబ్బందిపడుతున్నారు.

ఇదీ సాగు పరిస్థితి..

గజపతినగరం సబ్‌డివిజన్ పరిధిలో 1,545 హెక్టార్లలో మొక్కజొన్న రైతులు సాగుచేసినట్లు అధికారులు చెబుతున్నారు. రబీలో గజపతినగరం మండలంలో 781 హెక్టార్లు, దత్తిరాజేరు మండలంలో 372 మెంటాడ మండలంలో 329 హెక్టార్లు, బొండపల్లి మండలంలో 63 హెక్టర్లలో మొక్కజొన్న సాగుచేశారు. ఏప్రిల్ మొదటి వారం నుంచే పంట చేతికి వచ్చింది. కొన్నిచోట్ల మేలో పంటకోశారు.అయితే గిట్టుబాటు వస్తుందని ధరకోసం కళ్లాల్లోనే కొన్నిచోట్ల సంచుల్లో నిల్వ చేశారు. మరికొన్నిచోట్ల కంకులు ఎండబెడుతున్నారు. అయితే ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా 2,090కి క్వింటా కొనుగోలు చేసేలా చర్యలుతీసుకు, ఆ ధర తమకు గిట్టుబాటు కాదని రైతులు కళ్లాలోనే నిల్వచేసి ఉంచారు. ఈనేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో కొంతమంది వ్యాపారులు పంటకోత సమయంలోనే క్వింటా 2,300 రూపాయలకు కొనుగోలుచేశారు. ఇంతలో కొందరు రైతులు నెలరోజులు పాటు కళ్లాల్లో ఉంచారు. అయితే ప్రభుత్వం క్వింటాకు చెల్లించే ధర పెంచక పోవడంతో రైతులు విక్రయించేందుకు ముందుకురావడంలేదు.


పురిటిపెంటలో ఎండబెట్టిన మొక్కజొన్న కంకులు

మొలకెత్తుతున్న కంకులు..

వందలాది ఎకరాల్లో చేతికొచ్చిన పంట కల్లాల్లో నిల్వచేయడంతోపాటు ఎండబెట్టారు. ఇంతలో ఇటీవల కురిసిన అకాలవర్షాల పుణ్యమాని మొక్కజొన్న కంకులు తడిపిపోయాయి. కొన్ని గ్రామాల్లో మొలకలు రావడంతో వ్యాపారులు కొనుగోలు చేయడంలేదు. ప్రభుత్వం కూడా కొనుగోలుకు ముందుకురావడంలేదు. దీంతో ఇప్పటికే పంటసాగుకు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. గజపతినగరం మండలంలోని సీతారామపురం, పురిటిపెంట, పడీశీల, లింగాలవలస తదితర గ్రామాల్లో అకాల వర్షాలకు పంట తడిసిపోవడంతో మొలకలు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఈనేపథ్యంలో మొక్కజొన్న కంకులు నిల్వచేయడానికి బయట వ్యాపారుల వద్ద ఒక గోనె సంచి రూ.30 చొప్పున కొనుగోలు చేయాల్సి వస్తోందని పలువురు చెబుతున్నారు. ఆరుగాలం కష్ట పడి పంట చేతికి వచ్చే సమయానికి వరుణుడి రూపంలో నష్టపోవాల్సివస్తోందని పలువురు రైతులు వాపోతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి పంటనష్టం అంచనాలు వేసి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

తడిసిమోపెడవుతున్న ఖర్చు..

మొక్కజొన్న సాగు వ్యయం తడిసిమోపెడవుతోందని రైతులు వాపోతున్నారు. ఎకరా సాగుకు విత్తనాల నుంచి ఎరువులు, పురుగు మందులు, నీరు తడి, కూలీల రేట్లు కలుపుకొని 38 నుంచి 40 వేల వరకు ఖర్చు పెట్టాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ప్రకృతి సహకరిస్తే ఎకరాకు 35 నుంచి 38 క్వింటాల పంట దిగుబడి వస్తుందని పేర్కొంటున్నారు. అయితే పంట చేతికొచ్చినా ప్రభత్వం క్వింటా రూ.2,090కి మించి కొనుగోలు చేయకపోవడంతో దళారులను ఆశ్రయించాల్సి వస్తుందని వాపోతున్నారు.

రైతులను ఆదుకుంటాం..

రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని గజపతినగం ఏడీఏ కె.మహరాజన్ తెలి పారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటా రూ. 2090 ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇది వరకే రైతుల వద్ద మొక్కజొన్నను కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఇంకా రైతుల వద్ద మొక్క జొన్న పంట మిగిలి ఉంటే వారికోరిక మేరకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

కూటమి విజయం తథ్యం: జయకృష్ణ


మాట్లాడుతున్న జయకృష్ణ

పాలకొండ: పాలకొండ నియోజకవర్గంలో ఈనెల 13న జరిగిన పోలింగ్‌లో కూటమి వైపే ప్రజలు మొగ్గు చూపారని, తమ విజయం తథ్యమని కూటమి అభ్యర్థి నిమ్మక జయకృష్ణ తెలిపారు. బుధవారం పాలకొండలో మండలం, పట్టణ నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలకొండతోపాటు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు గంటా సంతోష్ కుమార్, నాలుగో వార్డు కౌన్సిల్ స భ్యుడు కొరికాన గంగునాయుడు, కరణం నారాయణరావు, సుంకరి అనీల్‌దత్తు, వెన్నపు శ్రీనివాసరావు, అంపోలు శ్రీనివాసరావు, జవరాజు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులు విజయం సాధించాలి

గరివిడి: కూటమి అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో విజయం సాధించాలని ఎన్డీఏ కూటమి విజయనగరం లోక్‌సభ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. మండలంలోని కొండదాడిలో విజయదుర్గా దేవస్థానం నిర్వాహకులు పచ్చ ముట్ల సాయిరాజు ఆధ్వర్యంలో కూటమి అధికారంలోకి రావాలని, నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రికావాలని ఈనెల 4వతేదీ నుంచి విజయదుర్గా గణపతి కార్యసిద్ధి హోమం నిర్వహించారు. చివరిరోజున అప్పలనాయుడు కుటుంబ సమేతంగా పాల్గొని హోమాన్ని చేశారు. కార్యక్రమంలో కుచ్చర్ల పాటి త్రిమూర్తులరాజు పాల్గొన్నారు.

జనసేన నాయకులకు అభినందన

వీరఘట్టం: మండలంలోని కుంబిడి ఇచ్ఛాపురంలో బుధవారం జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి డీపీ నాయుడును ఆ పార్టీ నాయకులు సన్మానించారు. ఉమ్మడి అభ్యర్థి నిమ్మకజయకృష్ణ గెలుపు కోసం ప్రచారం చేసిన జనసేననాయకులను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌరు నాయుడు, జనసేన జానీ, పుండరి, గోపాలకృష్ణ, హరిష్‌కుమార్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తలు అవసరం


అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

పాలకొండ: అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ జాగ్రత్తవహించాలని పాలకొండ అగ్నిమాపకశాఖ అధికారి జామి సర్వేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం పాలకొండ పట్టణంలోని కెనరా బ్యాంక్‌లో అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. విద్యుత్ ఉపకరణాలు, విలువైన కాగిత సంబంధిత అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాథమిక దశలోనే నివారించడానికి తీసుకో వలసిన జాగ్రత్తలను వివరించారు. ప్రమాదాలు జరిగినప్పుడు 08941-260111 నెంబరుకు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ బూరాడ గోవిందరావు, బి.అనిల్ కుమార్, వై.ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

జూన్ ఆరో తేదీ వరకూ 144 సెక్షన్: ఎస్ఐ

బలిజిపేట: మండలంలో 144 సెక్షన్ అమలులో ఉండడంతో ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని ఎస్ఐ వి.పాపారావు కోరారు. బుధవారం బలిజిపేటలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో జూన్ ఆరో తేదీ వరకు 144 సెక్షన్ అమలు చేయాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. ఎక్కువమంది ఒకే దగ్గర ఉండి చర్చించకూడదని తెలిపారు.

నవధాన్యాలతో భూమి సారవంతం: డీపీఎం


నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న షణ్ముఖరాజు

గరుగుబిల్లి: నవధాన్యాలతో భూమి సారవంతమవుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ డీపీఎం వి.షణ్ముఖరాజు తెలిపారు. బుధవారం మండలంలోని సంతోషపురం, ఖడ్గవలసల్లో ప్రకృతి వ్యవసాయం అమలు చేస్తున్న రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవధాన్యాలను సాగు వల్ల అధిక దిగుబడులతో పాటు నీటి తేమను నిల్వ చేసుకోవడానికి, పంటలకు అవసరమైన సూక్ష్మ, స్థూల పోషకాలు సమృద్ధిగా అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, మండల ఇన్‌చార్జి వి.పోలినాయుడు, బి.ధనుంజయ, ఎన్.ప్రసాద్, రైతులు ఎరుకునాయుడు, పోలినాయుడు పాల్గొన్నారు.

ఆర్పీఎఫ్ డీఎస్పీకి సన్మానం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్ సర్కిల్‌లో ఆర్పీఎఫ్ డీఎస్పీ నాయక్‌ను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సన్మానించారు. ఎన్నికల విధులకు నాయక్ ఇక్కడకు వచ్చారు. ఇక్కడ నుంచి ఉత్తరప్రదేశ్ బదిలీపై వెళ్లారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం

గరుగుబిల్లి: గరుగుబిల్లిశాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం బుధవారంప్రారంభించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ శాఖాగ్రంథాలయ నిర్వాహకుడు నల్ల మధుసూదనరావు మాట్లాడుతూ జూన్ ఏడో తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తామని తెలిపారు.కథలు వినడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, ఆటల పోటీలు ప్రతి రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు.


క్యారమ్స్ పోటీలను పరిశీలిస్తున్న మధుసూదనరావు

ఠారెత్తించిన ఎండలు

పార్వతీపురం టౌన్: పార్వతీపురంలో ఎండలు ఠారెత్తించాయి. ఆర్టీసీ కాంప్లెక్స్, నాలుగు రోడ్లు, పాత బస్టాండ్ కూడళ్లు నిర్మానుష్యంగా మారాయి. బుధవారం మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కర్ఫ్యూను తలపించేలా వివిధ కూడళ్లు జన సంచారం లేక బోసిపోయాయి.


ఆర్టీసీకాంప్లెక్స్ కూడలి నామమాత్రంగా జనసంచారం